సాక్షి కామారెడ్డి

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



సాదాసీదాగా సమావేశాలు

జిల్లా కేంద్రంలో జెడ్పీ హాల్‌లో జెడ్పీ చైర్ పర్సన్ దఫేదార్ శోభ ఆధ్వర్యంలో స్థాయీ సంఘ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

- 10లో ▸



టీబీ నిర్మూలనకు కృషి

జిల్లాలో టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రోగ్రాం జిల్లా అధికారి రాధిక పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.7 /24.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రత ఉంటుంది. సాయంత్రం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు భారీ వర్ష సూచన

రుద్రూర్: ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడు రోజులు (ఈ నెల 14, 15, 16 తేదీల్లో) ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేవీకే శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. రైతులు పొలాల్లో రసాయన మందులను మూడు రోజుల పాటు పిచికారి చేయొద్దని సూచించారు.

అక్కాపూర్ శివారులో చిరుత సంచారం..

- లేగ దూడను ఎత్తుకెళ్లిన వైనం



మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్ గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. మంగళవారం గ్రామానికి చెందిన దుద్దల రాములు అనే రైతు చేను వద్ద కట్టేసిన లేగ దూడ కనిపించకపోవడంతో బుధవారం గ్రామ శివారులో గాలించారు. దీంతో పంట పొలాల్లో చిరుత పాదముద్రలు కనిపించడంతో ఆ చిరుత పులే లేగ దూడను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనతో గ్రామస్తులు భయంతో వణికిపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఆ చిరుతను బంధించాలని గ్రామస్తులు కోరారు.

నిలకడగా 'సాగర్' నీటిమట్టం



నిజాంసాగర్(జుక్కల్) : ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 4,000 వేలక్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గడంతో మంజీరలోకి నీటి విడుదలను నిలిపేశారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగు 17.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 1404.94 అడుగులు 17.72 టీఎంసీల నీరు నిల్వ ఉందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



కామారెడ్డి టౌన్ : నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ. 15 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎస్‌డీఎఫ్ ప్లానింగ్ నిధులు జీవో 367 ద్వారా నిధులు వచ్చాయని నియోజకవర్గంలోని మొత్తం 399 అభివృద్ధి పనులకు ఈ నిధులు కేటాయించినట్లు తెలిపారు. కామారెడ్డికి రూ.1.17కోట్లు, దోమకొండ రూ. 1.62కోట్లు, బీబీపేట్ 2.23 కోట్లు, భిక్కనూర్ 2.03 కోట్లు, రాజంపేట్ రూ. 87లక్షలు, మాచారెడ్డి రూ. 3.52కోట్లు, రామారెడ్డి 1.38కోట్లు, కామారెడ్డి అర్బన్ రూ. 2.18 కోట్లతో పనులు చేస్తున్నామని, త్వరలోనే పనులను పూర్తి చేస్తామన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, ఎంపీపీ ఆంజనేయులు, చందు,బల్వంత్‌రావు,శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

చేరువైన వైద్య విద్య!

- జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు
- రేపు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి, స్పీకర్, విప్, ఎమ్మెల్యేలు
- వేడుకగా జరిపేందుకు ఏర్పాట్లు



సాక్షి, కామారెడ్డి : జిల్లా కేంద్రంగా ఎదిగిన కామారెడ్డి పట్టణానికి మెడికల్ కాలేజీ కూడా వస్తుందని సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నెరవేరింది. వైద్యవిద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లే రోజుల నుంచి సొంత ఊళ్లో మెడికల్ కాలేజీలో సీటు వస్తే ఇక్కడే చదువుకునే అవకాశం విద్యార్థులకు ఏర్పడింది. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలని సీఎం కేసీఆర్ ఏటా కొన్ని కాలేజీలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా కామారెడ్డికి మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే క్లాసులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన తొమ్మిది కాలేజీలను ఈ నెల 15న సీఎం కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కాలేజీ స్థలంలో నిర్మించిన మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రి భవనంలో మెడికల్ కాలేజీని ప్రారంభిస్తున్నారు. ప్రారంభోత్సవ వేడుకలో జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్‌సింధేతో పాటు జిల్లాకు చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. కళాశాలలో చదువుకునే విద్యార్థుల కోసం హాస్టళ్లకు ప్రైవేటు భవనాలను తీసుకున్నారు.

కళాశాలను ప్రారంభించిన వెనువెంటనే తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రొఫెసర్లు, సిబ్బంది విధుల్లో చేరారు. కాగా మెడికల్ కాలేజీకి సొంత భవనం నిర్మించేందుకు ఇప్పటికే నిధులు కూడా మంజూరయ్యాయి. భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.

కాలేజీలో వంద సీట్లు..

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీలో వంద సీట్లను కేటాయించారు. 85 సీట్లు నీట్ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులతో భర్తీ చేస్తారు. మిగితా 15 సీట్లు ఆల్ ఇండియా కోటాలో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. కాగా నీట్‌లో సాధించిన ర్యాంకుల ఆధారంగా విద్యార్థులు ఆన్‌లైన్లో ఇచ్చిన ఆప్షన్ల మేరకు ఇప్పటికే సీట్లు కేటాయించారు. కామారెడ్డి మెడికల్ కాలేజీలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సీట్లు సంపాదించుకున్నారు. కాలేజీ ఏర్పాటు అవుతున్న తొలి ఏడాదిలోనే సీట్లు పొంది ఇక్కడే చదువుకునే అవకాశం లభించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జన సమీకరణ..

మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ వద్ద పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించాలని నిర్ణయించారు. వీలైతే పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. 15వేల నుంచి 20వేల వేల మందిని సమీకరించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో సమీకరిస్తే బాగుంటుందని మంత్రి పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి బాటలు

కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనుండడంతో ఉన్నత విద్యకు సంబంధించి మరిన్ని కాలేజీలు వస్తాయని భావిస్తున్నారు. వైద్య రంగానికి సంబంధించి మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ, ఇతర డిపార్టుమెంట్లకు సంబంధించిన డిప్లొమా కోర్సులతో కాలేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే జిల్లాలో ఒక్కటి కూడా ఇంజనీరింగు కాలేజీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. జేఎన్‌టీయూ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ నిర్ణయం భేష్



కామారెడ్డి కలెక్టరేట్‌లోని మినిస్టర్ చాంబర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్

- వైద్యవిద్యలో దేశంలోనే అగ్రభాగాన ఉన్నాం
- ప్రారంభోత్సవ వేడుకకు అందరూ తరలిరావాలి
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి : దేశంలో మరెక్కడా లేని విధంగా జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కామారెడ్డి ప్రజల చిరకాల వాంఛ అయిన మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. 15వ తేదీ సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావ్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా మెడికల్ కళాశాలలను ప్రారంభిస్తున్నారని తెలిపారు. కామారెడ్డిలో మెడికల్ కాలేజీ వల్ల ఏటా వంద మంది డాక్టర్లు తయారవుతారని, ఇక్కడ 330 పడకల ఆస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడకముందు 20 మెడికల్ కాలేజీలు ఉండేవని, ఇప్పుడు 56కి చేరాయన్నారు. అప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఐదు మాత్రమేనని, ఇప్పుడు 28కి చేరాయని పేర్కొన్నారు. అప్పుడు కేవలం 2,850 సీట్లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు 8,515 సీట్లకు చేరుకున్నామన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు 850 నుంచి 3,915 పెరగడం ద్వారా పేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రతీ ఏడాది మన రాష్ట్రం నుంచి 8,515 మంది వైద్యులు తయారవుతారని, ఇంత మంది ఏ రాష్ట్రంలోనూ ఉండరని స్పష్టం చేశారు. పీజీ సీట్లు కూడా అప్పుడు 1,183 ఉంటే ఇప్పుడు 2,890 కి చేరాయని, ప్రభుత్వ పీజీ సీట్లు 515 నుంచి 1,320 కి పెరిగాయన్నారు. సూపర్ స్పెషాలిటీ సీట్లు కూడా 79 నుంచి 206 కు పెరిగినట్లు తెలిపారు.

పండుగలా జరుపుకుందాం

జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 15న పెద్ద పండుగ జరుపుకోవాలని మంత్రి చెప్పారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు అన్ని వర్గాల వారు వేడుకలో భాగస్వాములు కావాలన్నారు. అందరూ పాల్గొని సీఎంకు కృతజ్ఞతలు తెలపాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్‌సింధే, జాజాల సురేందర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్ తదితరులున్నారు.

మైనారిటీలకు రూ.లక్ష సాయం పంపిణీ

ప్రభుత్వం మైనారిటీ యువత ఆర్థికాభివృద్ధి కోసం అందిస్తున్న రూ.లక్ష సాయం పథకం కింద మంజురైన యూనిట్లను ఐదుగురు లబ్ధిదారులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు.

ఓటు ఎంతో విలువైనది

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : పొరపాట్లు లేని, స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సెకండ్ సమ్మరి రివిజన్‌లో భాగంగా ఈనెల 19 వరకు చేపట్టనున్న నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఖాసీం అలీ, మదన్ లాల్ జాదవ్, జూకంటి ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్, నరేందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు

స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ 2.0 కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రామాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మురుగు కాలువలను శుభ్రపర్చడం,చారిత్రక ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, స్వచ్ఛత రన్, ప్రతిజ్ఞ, శ్రమదానం లాంటివి నిర్వహించాలన్నారు.

వైద్యకళాశాల పనుల పరిశీలన

జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల బాలికల, బాలుర వసతి గృహాలను బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈనెల 15 లోగా వసతిగృహం పనులను పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో ఉద్యోగులదే కీలకపాత్ర

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



బాన్సువాడలో టీఎన్జీవో భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులే ఉద్యోగులని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన టీఎన్జీవోస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో సకలజనుల సమ్మెకు మద్దతుగా టీఎన్జీవోస్ చేసిన 42 రోజుల పెన్‌డౌన్ స్వరాష్ట్ర ఉద్యమంలో కీలకమైన మలుపన్నారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో మిగితా రాష్ట్రాల్లో అమలు చేయడం లేదన్నారు. చంద్రబాబు హయాంలో చర్చలు మాత్రమే ఉండేవని, కానీ సీఎం కేసీఆర్ హయాంలో నిర్ణయాలే ఉంటున్నాయన్నారు. టీఎన్జీవోఎస్ నూతన భవనం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజురు చేస్తానన్నారు.

ప్రభుత్వ రుణం తీర్చుకోవాలి

ప్రభుత్వ ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ప్రభుత్వ రుణం ప్రతి ఉద్యోగి తీర్చుకోవాల్సిన అవసరం ఉందని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ అన్నారు. ఈనెల 22 తర్వాత పీఆర్సీపై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని, ఐఆర్ ప్రకటించే అవకాశం ఉందన్నారు. బాన్సువాడలో నూతనంగా నిర్మించిన టీఎన్జీవోస్ భవనం రాష్ట్రంలోనే మొట్టమొదటిదన్నారు.టీఎన్జీవోఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్, కామారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి సాయిలు, బాన్సువాడ అధ్యక్ష, కార్యదర్శిలు వెంకట్, అనిల్, సభ్యులు తుల శ్రీనివాస్, విజయభారతి, రజిని, జగన్ ఉన్నారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బంద్

- నిలిపేసిన ఏజెన్సీ నిర్వాహకులు
- సమస్యల పరిష్కారానికి డిమాండ్
- పట్టించుకోని అధికార యంత్రాంగం



హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేపడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు

కామారెడ్డి రూరల్ : జిల్లాలోని ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న ఏజెన్సీల నిర్వాహకులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెబాట పట్టారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో వారు 13వ తేదీ నుంచి స్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని నిరవధికంగా నిలిపేశారు. తాము ఎన్ని ఆందోళనలు చేసినా అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించట్లేదనే ఉద్దేశంతో బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజనాన్ని నిలిపేశారు.

జిల్లావ్యాప్తంగా 1,011 పాఠశాలలు..

జిల్లావ్యాప్తంగా 187 ఉన్నత పాఠశాలలు, 127 ప్రాథమిక పాఠశాలలు, 697 ప్రాథమికోన్నత, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. మొత్తం 94,126 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికి మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు.

ఏడు నెలలుగా అందని వైనం..

జిల్లావ్యాప్తంగా 1,011 పాఠశాలల్లో 1,011 ఏజెన్సీలు ఉన్నాయి. డ్వాక్రా సంఘాల మహిళలు, ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే మధ్యాహ్న భోజన పథకంలో వంటలు చేసేందుకు అనుమతులు ఇచ్చారు. అలాగే ఏజెన్సీ నిర్వాహకులకు నెలకు గౌరవ వేతనం కింద గతంలో రూ. 1,000 ఉండేది. అయితే 18 నెలల కింద రూ. 3 వేలు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. జూలై నెల నుంచి 3వేల గౌరవ వేతనం అందిస్తూ బకాయిలు వెంటనే చెల్లించాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పినప్పటికీ నేటికి బడ్జెట్ విడుదల కాలేదని వారు వాపోయారు.

రావాల్సిన బిల్లులు పెండింగ్

పాఠశాలలకు కిరాణా సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు అన్నింటికీ కలిపి నెలకు సుమారు రూ. 1 కోటి 76 లక్షల బిల్లులు వస్తాయి. డిసెంబర్ నుండి ఆగస్టు వరకు ఏడు నెలల బిల్లులు కలిపి సుమారు 2 కోట్ల బిల్లులు రావాలి. అలాగే 1,011 మంది వర్కర్లకు నెలకు 3 వేల చొప్పున 3 కోట్ల 33 లక్షలు రావాలి. కానీ ప్రభుత్వం ఏడు నెలల బిల్లులు, వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదు.

బిల్లులు త్వరగా చెల్లించాలి



మూడు నెలలుగా బిల్లులు, రెండు నెలలుగా గౌరవ వేతనం రాలేదు. సరుకులను వడ్డీలకు తీసుకొచ్చి మరీ భోజనం పెడుతున్నాం. దీంతో దుకాణాదారులు అప్పులివ్వడం లేదు. కార్మికులకు పెంచిన రూ.3 వేలు గౌరవ వేతనం ఇవ్వలేదు. – సోమలింగం, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం అధ్యక్షుడు, అడ్లూర్

బడ్జెట్ రాగానే చెల్లిస్తాం



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు సమ్మెకు వెళ్తున్నట్లు కలెక్టర్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. అయితే విద్యార్థులకు ఇబ్బందికాకుండా యాథావిధిగా మధ్యాహ్న భోజనం వండాలని కోరాం. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బడ్జెట్ విడుదల కాగానే బిల్లులు చెల్లిస్తాం. – రాజు, డీఈవో, కామారెడ్డి

అంచనాల కంటే తగ్గిన సేద్యం

- జిల్లాలో 4,73,087 ఎకరాల్లో పంటల సాగు
- ఇతర పంటల సాగులో మార్పులు



కామారెడ్డి క్రైం: కొద్దిపాటి అకాల వర్షాలు, వరదలు మినహా గతేడాది ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశాజనకంగానే సాగింది. కానీ ఈసారి పంటల సాగు విషయంలో రైతులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రారంభంలో వర్షాభావం, తర్వాత భారీ వర్షాల కారణంగా ప్రస్తుత ఖరీఫ్ చాలా చోట్ల పంటల సాగు నిరాశాజనకంగానే కొనసాగుతుంది. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు ముఖం చాటేయడంతో జిల్లా వ్యాప్తంగా పంటల సాగులో స్వల్ప తగ్గుదల కనిపించింది. వరి నాట్లు ఆలస్యం కావడంతో నిన్న, మొన్నటి వరకు వ్యవసాయ శాఖ అధికారులు పంట నమోదు ప్రక్రియను కొనసాగించారు. జిల్లావ్యాప్తంగా 4,73,087 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చినట్లుగా గుర్తించారు. ఎప్పటిలాగే జిల్లాలో ప్రధాన పంటగా వరి సాగులోకి వచ్చింది. మిగితా పంటల సాగులో కొద్దిపాటి వ్యత్యాసాలు కనిపించాయి.

అంచనాల కంటే తక్కువ..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొన్నటి వరకు వరి నాట్లు పడ్డాయి. రెండు రోజుల క్రితం వరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పంటల గణన చేపట్టారు. జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 2,34,983 ఎకరాలు. ఇదిలా ఉండగా గతేడాది ప్రారంభంలోనే వర్షాలు సంవృద్ధిగా కురవడంతో 3,01,453 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ ఏడాది 2,95,310 ఎకరాల్లో వరి సాగు జరగవచ్చని అధికారులు అంచనా వేశారు. కానీ 2,76,461 ఎకరాల్లో మాత్రమే వరి సాగు జరిగింది. సాధారణం కంటే ఎక్కువే అయినప్పటికీ అంచనాల కంటే 18,849 ఎకరాలు తక్కువ. మొక్కజొన్న పంట కూడా 58,767 ఎకరాల్లో, సోయాబీన్ 82,613 ఎకరాల్లో మాత్రమే, పత్తి 27,332 ఎకరాల్లో మాత్రమే సాగైంది. కంది పంట మాత్రమే అంచనాలకు మించి సాగులోకి వచ్చింది. 17,407 ఎకరాల్లో రైతులు కంది సాగు చేశారు.

దిగుబడులపై ప్రభావం..

ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు ఆలస్యంగా పడ్డాయి. దీంతో ఆరుతడి పంటలైన మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, మినుము, పెసర లాంటి పంటలు సరిగ్గా మొలకెత్త లేదు. మొలక శాతం తగ్గింది. ఆ తర్వాత భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆయా కారణాలతో ఆరుతడి పంటల సాగు ఈ సారి ఆశాజనకంగా లేదని రైతులు చెబుతున్నారు. దిగుబడులపై ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని భావిస్తున్నారు.

జిల్లాలో సాగవుతున్న పంటల వివరాలు (ఎకరాల్లో)

				మినుము	3,946
వరి	2,76,461	కంది	17,407	చెరుకు	1,357
మొక్కజొన్న	58,767	పత్తి	27,332	ఇతర పంటలు	406
సోయాబీన్	82,613	పెసర	4,798	మొత్తం	4,73,087

జాగ్రత్తలు పాటించాలి




పంటల సాగు విషయంలో రైతులకు అన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నాం. రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. దిగుబడులు పెంచుకోవడం కోసం స్థానికంగా ఉండే వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించాలి. అధికారుల నుంచి సలహాలు, సూచనలు పొందాలి.

– భాగ్యలక్ష్మి, డీఏవో, కామారెడ్డి

బీజేపీ బస్సు యాత్రను సక్సెస్ చేయాలి

- ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం
- 119 నియోజకవర్గాల్లో..
- గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో కేసీఆర్‌కు ఓటమి తప్పదు
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో ఈనెల 20న ప్రారంభమయ్యే బీజేపీ బస్సు యాత్ర 119 నియోజకవర్గాల్లో కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 20న ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రారంభం కానున్న యాత్ర 'కొమురం భీం' యాత్రగా పిలువబడుతుందన్నారు. 29 నియోజకవర్గాల్లో 19 రోజుల పాటు 1,100 కిలోమీటర్లు కొనసాగుతుందని అన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో భారీ బహిరంగ సభలు ఉంటాయన్నారు. కామారెడ్డిలో పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఈ సభకు జాతీయ నాయకులు హాజరవుతున్నారన్నారు. తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలని ప్రజలకి తెలియజేయడం, బీజేపీ అభివృద్దే ఈ యాత్ర లక్ష్యమన్నారు. గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ ఓటమి ఖాయమన్నారు. పోలీసులు, అధికారులు బీజేపీ నాయకులను, ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు కామన్ ఫ్రెండ్ ఎంఐఎం అన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన అభ్యర్థులు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోతారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అవకాశమివ్వాలన్నారు. రాష్ట్రంలో ఇంటలిజెన్స్ వ్యవస్థ బీఆర్ఎస్ నాయకుల గెలుపు కోసం పనిచేస్తోందన్నారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకట రమణారెడ్డి, నీలం చిన్నరాజులు, ఎంజీ వేణుగోపాల్ గౌడ్, తేలు శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీకాంత్, నరేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

క్లుప్తంగా

డెంగీతో బీటెక్ విద్యార్థి మృతి


భరత్

నిజామాబాద్‌నాగారం: డెంగీ కేసులు జి ల్లాలో క్రమంగా పెరుగుతున్నాయి. ఇందల్‌వాయి మండలం తిర్మన్‌పల్లి కి చెందిన బీటెక్ విద్యార్థి భరత్ డెంగీతో బుధవారం మృతి చెందాడు. జ్వరం రావడంతో ఇంటివద్ద మందులు వాడినా తగ్గకపోవడంతో మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. మంగళ వారం విద్యార్థి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైద్రాబాద్‌లోని నిమ్స్‌కు తలించగా చికిత్స పొదు తూ మృతి చెందాడు. జిల్లాలో డెంగీ జ్వరంతో నెలలో ఒకరిద్దరు మరణిస్తున్నారు. రెండు నెలల్లో 120 వరకు డెంగీ కేసులు నమో దు అయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు నిత్యం పదుల సంఖ్యలో డెంగీ బాధితులు వస్తున్నా అధికారికంగా నమోదు కావడం లేదు. కాగా ప్రభుత్వ ఆస్పత్రిలో జూలై, ఆగష్టు నెలలో ఒక్కొక్కరి చొప్పున డెంగీతో మరణించినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. డెంగీతో భరత్ మృతి అధికారులకు సమాచారం లేదు.

అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి 30 వరకు గడువు

కామారెడ్డి టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 30 వరకు తుది గడువు ఉన్నట్లు స్టడీ సెంటర్ సమన్వయకర్త రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే డిగ్రీ రెండు, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి అడ్మిషన్ పునరుద్ధరించుకోవాలని కోరారు.

నూతన పీజీ కోర్సుల మంజూరు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు విద్యా కమిషనర్, మరో ఐదు నూతన పీజీ కోర్సులను మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. కిష్టయ్య తెలిపారు. ఎంఎస్సీ ఫిజిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లీష్, ఎకనామిక్స్ కోర్సులు మంజూరు అయ్యాయని చెప్పారు. నూతన కోర్సులు కలిపి మొత్తం 9 పీజీ కోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

బ్లడ్ గ్రూప్‌లపై విద్యార్థులకు అవగాహన



పిట్లం(జుక్కల్): బ్లడ్ గ్రూపులపై మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు బ్లడ్ గ్రూపుల గురించి పూర్తిగా తెలుసుకోవడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని, భవిష్యత్తులో రక్తదానం చేసేటప్పుడు ఉపయోగపడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు గణేష్ రావు, ఉపాధ్యాయులు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏజెంట్‌పై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన ఆల్అదన్ ట్రావెల్స్ నడుపుతున్న ఏజెంట్ ఎండీ అజీమ్ కువైట్‌కు పంపిస్తానని నకిలీ వీసా ఇవ్వడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వినాయక్‌నగర్‌కు చెందిన ఎస్‌కే అన్వర్ హుస్సేన్ తన బావమరిదిని కువైట్‌కు పంపించాలని అజీమ్‌ను సంప్రదించారు. వీసాకు రూ.లక్ష,20వేలు అవుతుందని చెప్పి వసూలు చేశాడు. ఆగస్టు 15న వీసా కాపీ ఇచ్చిన అజీమ్ కువైట్ పంపేందుకు తప్పించుకు తిరుగుతున్నాడు. అనుమానం వచ్చిన హుస్సేన్ ముంబాయి వెళ్లి వీసా కాపీని అధికారులతో తనిఖీ చేయగా ఫేక్ అని తేలింది. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు అజీమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమ్మో చిన్నాపూర్ గండి

- కత్తులతో బెదిరించి నగదు దోచుకుంటున్న దుండగులు
- వరుస ఘటనలతో వెలుగులోకి వచ్చిన వైనం
- చుట్టుపక్కల గ్రామాల నిందితులే దాడులకు యత్నం!


చిన్నాపూర్ గండికి వెళ్లే దారి ఇదే

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ గండి ప్రాంతంలో అందమైన అడవి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు అందాలను చూసే వన ప్రేమికులకు వరుస దొంగతనాల దాడులతో చేదు అనుభవం ఎదురవుతోంది. ఈ గండిలో ప్రవేశించే వారిని దుండగులు దాడి చేస్తూ నగదును దోచుకెళ్తున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ప్రయాణమంటేనే జనం జంకుతుండేవారు. పొరపాటున మూత్రవిసర్జన కోసం వాహనం నిలిపి అడవిలోకి వెళ్తే ఇక అంతేసంగతి. దొంగల చేతిలో బలైపోవాల్సిందే. ఇలా గతంలో అనేక ఫిర్యాదులు రావడంతో స్పందించిన నాటి ఎస్సై సంతోష్‌కుమార్ చాకచక్యంగా వ్యవహరించారు. ఓ మహిళతో మారువేశంలో గండిలోని ఓ ప్రాంతంలో సంచరించి దొంగలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇలా మిగతా దొంగల విషయాన్ని రాబట్టారు. నాటి నుంచి ఈ ప్రాంతంలో దొంగతనాలు తగ్గుముఖం పట్టింది. గత నెల రోజుల నుంచి మళ్లీ ఈ దాడులు ప్రారంభమైనట్లు తాజా ఘటనల ద్వారా తెలుస్తోంది.

నందిపేట మండలం వన్నెల్ (కె) గ్రామానికి చెందిన గూండ్ల సాయికుమార్ తన స్నేహితురాలితో కలిసి చిన్నాపూర్ గండిలోని ఓ ప్రాంతంలో భోజనం చేస్తుండగా పగటి దొంగలు కత్తులు చూపి వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో పాటు నగదు తీసుకుని పారిపోయారు. వారు వెంటనే మాక్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా గతంలో ఎస్సై యాదగిరిగౌడ్ విచారించి దొంగతనానికి పాల్పడిన వ్యక్తి కల్లెడి గ్రామానికి చెందిన కొరిమి రాజుగా గుర్తించి పట్టుకున్నారు. రూ. 10వేల నగదుతో పాటు, బంగారు ఆభరణాలను రికవరీ చేసి జైలుకు పంపారు. తాజాగా ఈ నెల 12న ఆర్మూర్ మండలం మునిపల్లికి చెందిన నూతన వధూవరులు నిజామాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో చిన్నాపూర్ గండిలో ఉన్న అర్బన్ పార్కును తిలకించేందుకు వెళ్లారు. పార్కుకు తాళం వేసి ఉండడంతో ఎదురుగా ఉన్న అటవీ అందాలను తిలకించేందుకు వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ఆ ప్రాంతంలో కారు ఆగి ఉండడాన్ని గమనించి పెద్దగా కేకలు వేయడంతో దొంగలు పారిపోయినట్టు బాధితుల ద్వారా తెలిసింది. గండిలో దొంగతనాలకు పాల్పడే వారు చుట్టుపక్కల ఉన్న తండాలు, ఒడ్డెర కాలనీలతో పాటు కల్లెడి, చిన్నాపూర్, రాంచంద్రాపల్లి, గుత్ప గ్రామాలకు చెందిన కొందరు పగటి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ముందుగా గొర్రె కాపర్లు అందించిన సమాచారం మేరకు సుమారు 5గురు వ్యక్తుల్లో ఒకరు ఎత్తైన కొండ మీది నుంచి అడవిలోకి వచ్చేవారిని గుర్తిస్తాడు. ఆ విషయాన్ని వెంటనే కిందున్న వారికి సమాచారం అందిస్తాడు. వారు వెంటనే పార్కుకు వచ్చే వారిపై కత్తులతో బెదిరించి నగదు దోచుకుంటారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గండిలో దొంగతనాల నివారణకు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దొంగతనాలను అరికట్టాలి



చిన్నాపూర్ గండిలో ఇటీవల పగటి దొంగతనాలు ఎక్కువయ్యాయి. పోలీసులు నిఘాపెట్టి దొంగతనాలను అరికట్టాలి. పాత దొంగలే తిరిగి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–గంగాధర్, గ్రామస్తుడు

నిందితులను పట్టుకుంటాం



మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టాను. చిన్నాపూర్‌లో జరిగే పగటి దొంగతనాలపై విచారణ చేపడుతాం. ఆ ప్రాంతాల్లో ఇద్దరు కానిస్టేబుళ్లతో విధులు నిర్వహిస్తాం. త్వరలో దొంగలను పట్టుకుని జైలుకు పంపుతా.

–సుధీర్‌రావు, ఎస్సై, మాక్లూర్

కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ జెండా ఎగరేయాలి


బీర్కూర్‌లో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్

బాన్సువాడ: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ కోరారు. బుధవారం బీర్కూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ముందుగా మంజీర పరివాహక ప్రాంతాన్ని సందర్శించి నిల్వ చేసిన ఇసుక డంపులను అధికారులు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో అతి పెద్ద పార్టీగా గుర్తింపు ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందని గుర్తు చేశారు. ఈ నెల 17న హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహించే బహిరంగ సభకు సోనియా గాంధీ వస్తున్నారని, ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న వారందరు బాన్సువాడలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, నాయకు లు అలిబిన్ అబ్దుల్లా, ఖలేక్, హన్మండ్లు, అసద్, చంద్రశేఖర్‌రెడ్డి, మంత్రి గణేష్, శంకర్, లక్ష్మణ్, వహీద్, విజయ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాసుల రోహిత్ తదితరులు ఉన్నారు.

‘టీబీ నిర్మూలనకు కృషి చేద్దాం’


ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ రాధిక పిలుపునిచ్చారు. బుధవారం బిచ్కుందలో ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి టీబీ వ్యాధి గ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య పరీక్షలు, మందులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా బిచ్కుంద భూమి ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సమితి వారు కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు సామాజిక సేవ చేస్తున్నారని, పేదలకు వైద్యం అందించడంతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారని అన్నారు. భూమి ఫౌండేషన్ సేవలను గుర్తించి డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారని అన్నారు. భూమి ఫౌండేషన్ అధ్యక్షుడు బస్వరాజ్, వైద్య అధికారులు శిరీష, కామారెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు


మద్నూర్‌లో వినతి పత్రం అందిస్తున్న దళితులు

మద్నూర్(జుక్కల్): స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వారికి ఇష్టమున్న వారికే దళిత బంధు ఇస్తున్నారని అర్హులైన వారికి ఇవ్వడం లేదంటూ దళితులు, దళిత సంఘాల నాయకులు బుధవారం అదనపు కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌తో వారు మాట్లాడారు. జుక్కల్ నియోజకవర్గంలో దళితులకు అన్యాయం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన వారికే దళితబంధు కేటాయిస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలంటే అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేయాలని కోరారు. నాగేష్, మారుతి, పండరి, తదితరులు ఉన్నారు.

సాధారణ బదిలీలు చేపట్టాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

పిట్లం(జుక్కల్): సాధారణ బదిలీలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో అధ్యాపకులుగా పని చేస్తున్నవారికి సాధారణ బదిలీలు చేపట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయానందరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అధ్యాపకులు విష్ణు, మురళీమోహన్ కృష్ణ, నరేష్, సందీప్ కుమార్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి యువతి మృతి


ప్రియాంక (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని పోతురెడ్డిపల్లి శివారులోని బొమ్మడి చెరువులో ప్రమాదవశాత్తు ఓ యువతి కాలుజారిపడడంతో మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. తాండ వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోతురెడ్డిపల్లి తండాకు చెందిన శ్రీనివాస్ అన్నిబాయిల కుమార్తె ప్రియాంక (19) బుధవారం గేదెలకు నీరు తాగించేందుకు చెరువుకు వెళ్లగా ప్రమాదవశాత్తు పడి మృతి చెందిందన్నారు. చెరువులో ప్రియాంక కొట్టుకుపోతున్న విషయాన్ని గమనించిన ఓ యువకుడు తండావాసులతో కాపాడినా అప్పటికే ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఆసుపత్రికి వచ్చిన మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. జగిత్యాల జిల్లా వేములకుర్తి గ్రామానికి చెందిన గంగానర్సు మతిస్థిమితం లేని తన కుమార్తెతో కలిసి ఆసుపత్రికి వచ్చింది. డాక్టర్ వద్ద చూయించుకున్న తర్వాత మందులు తీసుకునే సమయంలో యువతి అదృశ్యమైంది. చుట్టుపక్కల ఎక్కడా వెతికినా ఆచూకీ లభించలేదు. గంగానర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైకుల స్వాధీనం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో బైక్‌లు చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. బోధన్‌కు చెందిన షేక్ సోహేల్, రాకాసిపేట్‌కు చెందిన సయ్యద్ జమీల్ బుధవారం ఉదయం 4.30 గంటలకు నంబర్‌ప్లేట్ లేని బైక్‌పై నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తుండగా రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్సై వారిని విచారించారు. వీరిపై అనుమానం రావడంతో విచారణ చేపట్టగా చోరీ చేసినట్లు నిందితులు తెలిపారు. అనంతరం వీరి నుంచి 12 పల్సర్ బైక్‌లు, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, ఒక ఆక్టివాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితులను పట్టుకున్న ఎస్సై మహేశ్, సిబ్బంది సుధాకర్, రాజేశ్వర్, సర్దార్, రాము, సందీప్‌ను సీపీ సత్యనారాయణ, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ కృష్ణ అభినందించారు.

నిందితుడికి రిమాండ్



నిజాంసాగర్(జుక్కల్): డబ్బుల కోసం అమ్మమ్మను హత్యచేసిన బాలపోశయ్యను బాన్సువాడ పట్టణ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిజాంసాగర్ మండలం తెల్గాపూర్‌కు చెందిన దుంపల అక్కవ్వ(70)ను ఈ నెల 11న బాలపోశయ్య హత్య చేసి పారిపోయాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సబ్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలి


పెద్ద ఎక్లార గేట్ వద్ద పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్

మద్నూర్(జుక్కల్): విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్ద ఎక్లార గేట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.3 కోట్ల నిధులతో విద్యుత్ సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని, మరో నాలుగైదు నెలల్లో పనులు పూర్తి కావచ్చని చెప్పారు. ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ రమేశ్‌బాబు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు క్రీడాకారులు వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు ఆర్చరీ కోచ్ ప్రతాప్ దాస్ తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో ఇందు, అండర్–17 బాలుర విభాగంలో అనుదీప్, రాజు, బాలికల విభాగంలో అక్షర, అండర్–19 విభాగంలో నవీన్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఆర్చరీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామినేని అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కదిరె మోహన్‌రెడ్డి, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, పీడీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కొడుకును చంపిన తల్లికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: కన్న కొడుకును చంపిన తల్లికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్గట్ల మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన గుండ నవ్యకు తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన గుండ అభిషేక్‌తో 2015లో వివాహం జరిగింది. వీరికి నాగేంద్ర(4) బాబు ఉన్నాడు. వివాహానికి ముందు నవ్య ఆర్మూర్ మండలంలోని ఖానాపూర్‌కు చెందిన నరేశ్‌తో ప్రేమ వ్యవహారం నడిపింది. పెళ్లి తరువాత కూడా వీరు ప్రేమ పేరుతో తమ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఇది గమనించిన భర్త నవ్యకు సర్దిచెప్పాడు. దీంతో నవ్య కుమారుడితో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. కుమారుడిని చూసేందుకు అభిషేక్ అత్తాగారింటికి అప్పుడప్పుడు వెళ్లేవాడు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా నిలుస్తున్న కుమారుడు నాగేంద్రను హత్య చేయాలని నవ్య భావించింది. అదే సమయంలో అభిషేక్ దుబాయి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన నవ్య 2020 నవంబర్ 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమారుడి గొంతు నులిమి హత్య చేసింది. న్యాయ విచారణలో నవ్య చేసిన నేరం రుజువు కావడంతో జీవిత కారాగార శిక్ష తోపాటు రూ.2వేల జరిమాన విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. రెండవ ముద్దాయి నరేశ్‌పై నేరారోపణ రుజువు కానందున నిర్దోషిగా విడుదల చేశారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాను చేస్తున్న పని ఇష్టం లేక, ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొల్లారంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డమీది ప్రవీణ్(28) తల్లి 20 ఏళ్ల క్రితం చనిపోయింది. ప్రవీణ్ అక్కకు గతంలో వివాహం కాగా భర్త మృతి చెందాడు. నాటి నుంచి వారితోనే ఉంటోంది. తండ్రి ఆరోగ్యం సైతం బాగా లేకపోవడంతో పాటు కుటుంబ ఆర్థికపరిస్థితితో ప్రవీణ్ చదువు మానేసి మేస్త్రీ పని చేసేవాడు. తాను చేస్తున్న పని తనకు నచ్చడం లేదని పలుమార్లు తండ్రితో చెప్పేవాడు. ఈ క్రమంలో మంగళవారం జప్తిజాన్కంపల్లిలో నిర్వహించిన బోనాల పండుగకు వెళ్లొస్తానని చెప్పి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కోటగిరి (రుద్రూర్): కోటగిరి మండల కేంద్రానికి చెందిన బర్ల సత్యనారాయణ (55) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడని గ్రామస్తులు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ తన పొలంలో గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం గమనించిన స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయమై ఎస్సైని సంప్రదించగా ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

మృతదేహం కోసం గాలింపు


కాలువలో గాలిస్తున్న జాలర్లు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ వద్ద వరద కాలువలో దూకి బలవన్మరణానికి పాల్పడిన ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన షేక్ రియాజ్(30) మృతదేహం కోసం బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. రియాజ్ అప్పుల బాధ తట్టుకోలేక కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. స్థానిక జాలర్లు గాలిస్తున్నా మృతదేహం ఆచూకీ లభించలేదని ఎస్సై గోపి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హత్య కేసులో మరొకరికి..

కామారెడ్డి క్రైం: హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. మద్నూర్ మండలం మదనహిప్పర్గ గ్రామానికి చెందిన గంగాధర్‌కు అదే గ్రామానికి చెందిన విరాధర్ మనోహర్‌కు మధ్య పాత కక్షలు ఉండేవి. 2014 నవంబర్ 13 న పాత కక్షలతో మనోహర్‌పై గంగాధర్ కత్తితో దాడి చేశాడు. గమనించిన మనోహర్ తమ్ముడు సంతోష్ అడ్డు రావడంతో అతడిని కూడా కత్తితో పొడిచాడు. సంతోష్ మృతి చెందడంతో గంగాధర్‌పై పోలీసులు హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ నిందితుడు గంగాధర్‌కు జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. సాక్ష్యాధారాలను సక్రమంగా ప్రవేశపెట్టడం, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి బిచ్కుంద సీఐలు వెంకటేశం, సర్దార్ సింగ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్, ప్రస్తుత సీఐ కృష్ణ, లైజనింగ్ ఆఫీసర్లు విఠల్, హనుమాండ్లు, కానిస్టేబుల్ విక్రంరెడ్డిని ఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

మొబైల్ షాపులో చోరీ

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌లో ఉన్న ఓ మొబైల్ షాపులో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. షాప్ తాళాలు పగులగొట్టి సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లినట్టు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బోధన్‌లో గొలుసు..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని హనుమాన్ టేకిడీ కాలనీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై మహిళ మెడలో ఉన్న గొలుసును బుధవారం చోరీ చేశారు. కాలనీకి చెందిన మహేశ్వరీ పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తోంది. విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 1300 నగదు స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడిలో ఏఎస్సై రంగారవు, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ తండాకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము బుధవారం తెలిపారు. గ్రామంలోని తన పంటను దున్నేసిన ట్రాక్టర్‌ను సీజ్ చేయాలని లకావత్ చందర్, గంగామణి, రుక్మాబాయి, చింటు స్టేషన్‌కు వచ్చి పోలీసులతో అమర్యాదగా ప్రవర్తించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో హెడ్ కానిస్టేబుల్ సామిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.